సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 21 । మార్చి । 2024



సోమశిలలో 11.60 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 11.60 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1900 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.




బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.67,690
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,079
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,261
సవర (8 గ్రాములు)	రూ.50,088

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0 /25.4

గాలిలో తేమ 66 శాతంగా బుధవారం నమోదైంది. ఉష్ణోగ్రతల్లో గురువారం పెద్ద మార్పేమీ ఉండబోదని వాతావరణ అధికారులు తెలిపారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురువారం	శుక్రవారం
6:25	4:57

న్యూస్‌రీల్

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

నెల్లూరు (టౌన్): పదో తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఇంగ్లిష్ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 916 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రెగ్యులర్‌కు సంబంధించి 28,411 మందికి గానూ 27913 మంది హాజరయ్యారు. ప్రైవేట్‌కు సంబంధించి 498 మందికి గానూ 418 మంది గైర్హాజరయ్యారు. ఆరు కేంద్రాల్లో జిల్లా అబ్జర్వర్ మువ్వా రామలింగం.. మూడు కేంద్రాల్లో డీఈఓ రామారావు, 68 కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపట్టారు.

బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కొండబిట్రగుంటలో కొలువైన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం ఈ నెల 25 వరకు నెల్లూరు నుంచి నాలుగు ఆర్టీసీ సర్వీసులను ప్రత్యేకంగా నడపనున్నారు. ఈ మేరకు ఆర్ఎం శేషయ్య బుధవారం ఒక ప్రకటనను విడుదల చేశారు.

డిస్టిలరీలో తనిఖీలు

వెంకటాచలం: సర్వేపల్లి సమీపంలోని ఎస్సెన్షే డిస్టిలరీస్‌ను కలెక్టర్ హరినారాయణన్ బుధవారం పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులతో కలిసి కేంద్రాన్ని పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి, సీఐలు శీను బాబు, రేఖ, గౌరి, ఎస్సై శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్రోశం.. ఆపై మౌనం

టీడీపీ కోవూరు నియోజకవర్గ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేరును ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేయడంతో ఆశావహుడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, ఆయన తండ్రి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఇటీవల నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో తమ ఆక్రోశం వెళ్లగక్కారు. 20 ఏళ్ల పాటు ప్రజలతో అనుబంధం ఉన్న తమ కుటుంబాన్ని కాదని.. కనీస పరిచయం లేని ఆమెను బరిలో ఎలా నిలుపుతారంటూ టీడీపీ అధినేతలపై మండిపడిన వీరు అంతలోనే మౌనం దాల్చారు. ఇలా మెత్తపడటంతో వీరి తీరును జీర్ణించుకోలేని టీడీపీ కేడర్ అయోమయంలో పడింది.

- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అభ్యర్థిత్వంపై దినేష్‌రెడ్డి తీరు
- డబ్బు సంచులు పనిచేశాయని టాక్
- అయోమయంలో టీడీపీ కేడర్



కోవూరు: విజయమే లక్ష్యంగా టీడీపీ తన రాజకీయ ప్రయోజనాల కోసం ఎలాంటి చర్యలకైనా వెనుకాడటంలేదు. కుదిరితే వెన్నుపోటు.. కుదరకపోతే డబ్బు సంచులనే రీతిలో ముందుకెళ్తోంది. కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి రాజకీయ వారసుడిగా టీడీపీలో అరంగ్రేటం చేసిన తనయుడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి రాజకీయ భవిష్యత్తును ఆ పార్టీ అధిష్టానం ప్యాకేజీతో సమాధి చేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆశలు ఆవిరి

టీడీపీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిని తానేనంటూ దినేష్‌రెడ్డి దాదాపు రెండున్నరేళ్లుగా ప్రచారం చేసుకున్నారు. రాజకీయాల్లో యువతరానికి ప్రాధాన్యమంటూ చంద్రబాబు, లోకేశ్ తమ ప్రచారాలతో ఊదరగొట్టారు. వీరి వ్యాఖ్యలతో తనకు ఇక తిరుగులేదనే ఊహల పల్లకిలో దినేష్‌రెడ్డి విహరించారు. అయితే అనూహ్యంగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి కోవూరు టికెట్‌ను ఖరారు చేసి తమ చేష్టలతో దినేష్‌రెడ్డిని నేలపైకి తీసుకొచ్చారు.

మొదట్లో ధిక్కారస్వరం

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కోవూరు అభ్యర్థిగా ఖరారు చేయడంతో తండ్రీకొడుకులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దినేష్‌రెడ్డి హతాశులయ్యారు. టీడీపీ నిర్వహించిన నాలుగు సర్వేల్లోనూ దినేష్‌రెడ్డి తొలి స్థానంలో ఉన్నా.. ధనబలం, రాజకీయ పరపతితో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి టికెట్‌ను కేటాయించి తమ గొంతు కోశారని ఆత్మీయ సమావేశంలో ఫైరయ్యారు. 2014 ఎన్నికలకు ముందు కోవూరులో టీడీపీకి అభ్యర్థి లేకపోతే.. కాంగ్రెస్‌లో ఉన్న తనను చంద్రబాబు బతిమిలాడి పార్టీ టికెట్ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అధికారం కోల్పోయాక పార్టీ కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చామని చెప్పారు. లోకేశ్ నిర్వహించిన యువగళం యాత్రకు దాదాపు రూ.15 కోట్ల వరకు ఖర్చు పెట్టామని, తమకు పార్టీ టికెట్ ఇవ్వకపోతే ప్రత్యామ్నాయం చూసుకుంటామని అల్టిమేటమిచ్చారు.

ఫలించిన 'డబ్బు' సంప్రదింపులు

ఈ తరుణంలో పోలంరెడ్డితో పార్టీ పెద్దలు సంప్రదింపులు జరిపారు. రూ.30 కోట్లకు బేరం పెట్టగా, చివరికి రూ.20 కోట్లకు ఓకే అన్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలతో పోలంరెడ్డి మౌనం దాల్చారని తెలుస్తోంది. అయితే ఇవ్వాల్సిన మొత్తంలోనూ రూ.ఐదు కోట్ల మేర పంగనామం పెట్టడంతో పార్టీ కార్యకలాపాలకు ఆయన దూరమయ్యారనే టాక్ వినిపిస్తోంది.

దిక్కుతోచని స్థితిలో కేడర్

పార్టీ అధిష్టానం పునరాలోచన చేయకపోతే ఇండిపెండెంట్‌గా దినేష్‌రెడ్డి పోటీ చేయాలని.. తామంతా టీడీపీకి కాకుండా ఆయనకే మద్దతుగా నిలుస్తామని కేడర్ చెప్పారు. ఎవరు పోటీ చేసినా తమ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. అయితే కేడర్ వ్యాఖ్యలపై పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మౌనంగా ఉన్నారు. ఈ తరుణంలో కేడర్‌లో స్తబ్దత నెలకొంది.

హెల్త్ ప్రొవైడర్ల వివరాల నమోదు తప్పనిసరి

నెల్లూరు(అర్బన్): ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో జిల్లాలోని హెల్త్ ప్రొవైడర్లు తమ వివరాలను తప్పక నమోదు చేసుకోవాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్స్, ల్యాబొరెటరీలు, స్కానింగ్ కేంద్రాలు, ఆప్తాల్మిక్, డెంటల్ క్లినిక్స్, ఫిజియోథెరపీ సెంటర్లలో అందించే వైద్యసేవలు, వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో నమోదు చేయాలని కోరారు. రిజిస్ట్రేషన్ చేయించుకోని వారిపై చర్యలు తప్పవని చెప్పారు. hprid. abdm. gov. in లో వివరాలను నమోదు చేయాలని సూచించారు.



ప్రదర్శనను తిలకిస్తున్న విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఖలీల్ అహ్మద్, చంద్రశేఖర్‌రెడ్డి, స్రవంతి తదితరులు

అలరించిన ఈస్టర్ కంటాట

నెల్లూరు(బృందావనం): శుభ శుక్రవారం, పునరుత్థాన ఘట్టాలను వివరించే ఈస్టర్ కంటాట ప్రదర్శనను నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో బుధవారం రాత్రి వేడుకగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ, నెల్లూరు రూరల్, నగర నియోజకవర్గ అభ్యర్థులు వేణుంబాక విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఖలీల్ అహ్మద్ తదితరులు హాజరయ్యారు. క్రైస్తవులకు ముందస్తు ఈస్టర్ శుభాకాంక్షలను ఆదాల తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో వీరు ఘన విజయం సాధించడంతో పాటు సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి బాధ్యతలు చేపట్టాలని కాంక్షిస్తూ దైవజనులు ప్రార్థనలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేయర్ స్రవంతి, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీ దాసరి రాజేష్, కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, తాళ్లూరు అవినాష్, జీజీహెచ్ కో ఆర్డినేటర్ కాకుటూరు లక్ష్మీసునంద, నేతలు తాళ్లూరు సురేష్‌బాబు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సహాయ కేంద్రాల ఏర్పాటు

ముత్తుకూరు: జిల్లాలో ఒకే ప్రాంతంలో ఐదు కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలున్న చోట ఓటరు సహాయ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్లో పది పోలింగ్ కేంద్రాలను సర్వేపల్లి నియోజకవర్గ ఆర్వో చిన్న ఓబులేసుతో కలిసి బుధవారం పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. సహాయ కేంద్రాల్లో ఉండే సిబ్బంది ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందో ఓటర్లకు తెలియజేయనున్నారని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. అతి పెద్ద ప్రాంగణమైన ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, టెంట్లు తదితర సౌకర్యాలను కల్పించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ డానియెల్ పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న హరినారాయణన్

హామీలు నెరవేర్చాం.. ఆశీర్వదించండి

- కూటమిని నమ్మొద్దు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


వెంకన్నపాలెంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తున్న మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు: '2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సంపూర్ణంగా నెరవేర్చాం. వచ్చే ఎన్నికల్లో కూడా ఆశీస్సులు అందించి వైఎస్సార్‌సీపీకి ఘన విజయాన్ని అందించండి' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, సర్వేపల్లి అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మంత్రి బుధవారం మండలంలోని వెంకన్నపాళెం గ్రామం నుంచి తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా వెంకన్నపాళెం పట్టపుపాళెం గ్రామానికి చేరుకున్న కాకాణికి స్థానిక మత్స్యకారులు అపూర్వ స్వాగతం పలికారు. ఆయన రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దళిత కాలనీకి వెళ్లగా అక్కడి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

కూటమిని తరిమి కొట్టండి

మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి వస్తున్నాయని, ఆ మహా దుష్ట కూటమిని నమ్మితే నట్టేట మునిగినట్లేనని తెలిపారు. 2014లో మూడు పార్టీలు కలిసి అధికారంలోకి వచ్చి హామీలను గాలికొదిలేశాయన్నారు. ఆ తర్వాత ప్రజల విశ్వాసం కోల్పోయిన నాయకులు ఒకరినొకరు తిట్టుకొన్నారన్నారు. మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధపడిన కూటమిని రాష్ట్ర ప్రజలు తరిమి కొట్టాలన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిని సైతం ప్రకటించుకోలేని స్థితిలో టీడీపీ ఉందన్నారు. ఇక్కడ వైఎస్సార్‌సీపీ ఎంత బలంగా ఉందో అర్థమవుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించి మూడోదఫా ఎమ్మెల్యేగా అవకాశమిస్తే నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్ రెడ్డి, పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, నాయకులు దువ్వూరు గంగాధర్ రెడ్డి, కావల్‌రెడ్డి రంగారెడ్డి, టంగుటూరు పద్మనాభరెడ్డి, గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంగమాంబ ఆలయ హుండీ కానుకల లెక్కింపు

ఉదయగిరి: దుత్తలూరు మండలంలోని నర్రవాడ వెంగమాంబ ఆలయంలో హుండీ కానుకలను బుధవారం దేవదాయ శాఖ అధికారులు లెక్కించారు. గత సంవత్సరం నవంబర్ 18వ తేదీ నుంచి బుధవారం వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.16,81,545లు వచ్చినట్లు ఈఓ ఉషశ్రీ తెలిపారు. ఈ నగదును బ్యాంకులో డిపాజిట్ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లు, వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ కరుణాకరబాబు, జిల్లా దేవదాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.


నగదును లెక్కిస్తున్న సిబ్బంది

రత్నం మృతి పట్ల ప్రముఖుల సంతాపం


కేవీ రత్నం (ఫైల్)

నెల్లూరు(టౌన్): రత్నం విద్యాసంస్థల అధినేత కేవీ రత్నం (83) మృతి పట్ల ప్రముఖులు సంతాపం తెలిపారు. రత్నం 1943వ సంవత్సరం మే 23న చలపనాయుడుపల్లిలో జన్మించారు. 1966లో వీఆర్ కళాశాలలో కెమిస్ట్రీ విభాగంలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. 1967లో సమీప బంధువైన పద్మావతిని వివాహం చేసుకున్నారు. వారికి వేణుగోపాల్, కృష్ణకిశోర్ అనే కుమారులున్నారు. 1983లో తన పేరు మీద కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. 1985లో ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తిస్థాయిలో సెంటర్‌ను నిర్వహించారు. చిన్నారి హార్ట్ ఫౌండేషన్ ద్వారా వందలాది మంది చిన్నారులకు గుండె వైద్యం చేయించారు. పేద విద్యార్థులకు అండగా నిలిచారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఆనం విజయకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, మేయర్ పొట్లూరి స్రవంతి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు బుధవారం నివాళులర్పించారు. కాగా రత్నం అంత్యక్రియలు గురువారం పిడతాపోలూరులోని విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించనున్నారు. హరనాథపురంలోని 5వ వీధి శ్రీకృష్ణ అవెన్యూలో ఉన్న స్వగృహంలో భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు.


నివాళులర్పిస్తున్న విజయసాయిరెడ్డి, ఆదాల

తీరనిలోటు

నెల్లూరు(దర్గామిట్ట): విద్యారంగంలో తనకంటూ ప్రత్యేకత చాటుకున్న రత్నం మృతి తీరని లోటని వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణంబాక విజయసాయిరెడ్డి అన్నారు. బుధవారం హరనాథపురంవెళ్లి రత్నం భౌతికకాయానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. రత్నం విద్యాసంస్థల ద్వారా వేలాది మందికి ఉజ్వల భవిష్యత్‌ను అందించారన్నారు. చిన్నారులకు హార్ట్ ఆపరేషన్లు చేయించి వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక


రామిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన తుమ్మల పెంట యువత

కావలి: మండలంలోని తుమ్మలపెంట పంచాయతీకి చెందిన టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి నివాసంలో తుమ్మలపెంట యువత ఆవుల విజయ్, వాయిల ఆనంద్, ఆవుల తిరుపతి, వాయిల బాబు, చిరంజీవి, ఆవుల బాలు, ఆవుల బాబు, ఆవుల గోవిందు తదితరులు ఎమ్మెల్యేని కలిసి పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. వారికి ఆయన కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు సంక్షేమ పథకాలు, కావలిలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై అనేక మంది వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు చెప్పారు.

రంగడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


పూజా కార్యక్రమాలు చేస్తున్న దృశ్యం


ఆలయంలో భక్తుల సందడి

నెల్లూరు(బృందావనం): సింహపురి క్షేత్రపాలకుడు, పవిత్ర పినాకిని తీరాన కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ చేశారు. రంగనాయకులపేటలో ఉన్న ఆలయంలో పూజా కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తొలిరోజు పుణ్యాహవచనం, విష్వక్సేనారాధన, మృత్సంగ్రహణం, ఉత్సవమూర్తులకు రక్షాబంధనం, సోమకుంభ ప్రతిష్ట, గరుడ ధ్వజ ప్రతిష్ట, అంకురార్పణ హోమం తదితర పూజలను అర్చకులు, వేదపండితులు విశేషంగా జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ముదివర్తి లక్ష్మీకామాక్షిచే భక్తిసంగీత, శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులచే భరతనాట్య ప్రదర్శనలు జరిగాయి. అంకురార్పణ ఉభయకర్తలుగా ఆనం గోపాలకృష్ణారెడ్డి వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం కార్య నిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు	
బ్రాయిలర్ (లైవ్)	106
లేయర్ (లైవ్)	73
బ్రాయిలర్ చికెన్	194
బ్రాయిలర్ స్కిన్‌లెస్	216
లేయర్ చికెన్	125

నిమ్మ ధరలు (కిలో)	
పెద్దవి	రూ.75
సన్నవి	రూ.70
పండ్లు	రూ.25



తల్లిని కొట్టాడని తండ్రిపై దాడి

- చికిత్స పొందుతూ మృతి
- కుమారుడి నిర్వాకం
- డేవిస్‌పేటలో విషాదం


ప్రసాద్ మృతదేహం

ఇందుకూరుపేట: ఓ మహిళపై ఆమె భర్త దాడి చేశాడు. దీంతో కోపంతో రగిలిపోయిన కుమారుడు తండ్రిని కొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని డేవిస్‌పేటలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. డేవిస్‌పేటకు చెందిన నెల్లూరు ప్రసాద్ (45), వెంకటరమణమ్మ దంపతులు కూరగాయల పంటలు సాగు చేస్తూ జీవనం సాగించేవారు. తమ పొలంలో పండిన వాటిపాటు, పరిసర ప్రాంతాల రైతుల నుంచి కొనుగోలు చేసిన కూరగాయలను వెంకటరమణమ్మ నెల్లూరు మార్కెట్ వద్ద విక్రయిస్తూ భర్తకు చేదోడువాదోడుగా ఉండేది. కొంతకాలం క్రితం భార్యాభర్తల నడుమ విభేదాలు చెలరేగాయి. దీంతో ఆమె రెండు నెలల నుంచి గ్రామంలోనే ఇంటిని అద్దెకు తీసుకుని ఇద్దరు కుమారులైన మహేష్, ధనుష్‌తో కలిసి నివసిస్తోంది. ప్రసాద్ మంగళవారం రాత్రి భార్య ఇంటి వద్దకు వచ్చి ఆమెపై గడ్డపారతో దాడి చేశాడు. ఇది గమనించిన చిన్న కొడుకు ధనుష్ గట్టిగా కేకలు వేయడంతో పెద్ద కొడుకు మహేష్ వచ్చి అడ్డుపడి గడ్డపారని లాక్కొని తిరిగి తండ్రిపై దాడి చేశాడు. తీవ్ర గాయాలైన ప్రసాద్‌ను చికిత్స నిమిత్తం బంధువులు నెల్లూరుకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. వెంకటరమణమ్మ నెల్లూరులో చికిత్స పొందుతోంది. సమాచారం అందుకున్న ట్రైనీ డీఎస్పీ హేమలత, కోవూరు సీఐ ఎం.శ్రీనివాస్, ఎస్సై వీరేంద్రబాబు బుధవారం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరాతీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

400 మందితో బందోబస్తు

- కావలి డీఎస్పీ వెంకటరమణ


బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీఎస్పీ వెంకటరమణ

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సుమారు 400 మందికి పైగా సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ తెలిపారు. కొండపై ఉత్సవాల సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లు, క్యూలైన్లు, ట్రాఫిక్ స్తంభించకుండా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్లేస్‌లు, ఇతర భద్రతా అంశాలను డీఎస్పీ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా, భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చూసేందుకు 400 మందిని బందోబస్తు విధులకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో కీలక ఘట్టాలైన గరుడోత్సవం, తెప్పోత్సవం, రథోత్సవం, కల్యాణోత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. భక్తుల వాహనాల కారణంగా కొండ దిగువన ట్రాఫిక్ స్తంభించకుండా పార్కింగ్ స్థలాలు కేటాయించామన్నారు. భక్తులు తమ వాహనాలను అక్కడ నిలిపి కాలినడకన కొండపైకి చేరుకోవాలని సూచించారు. కేవలం ముఖ్యమైన, ఆలయానికి సంబంధించిన వాహనాలకు మాత్రమే ప్రత్యేక పాస్‌లు మంజూరు చేసినట్లు వివరించారు. డీఎస్పీ వెంట ఎస్సై భోజ్యా, సిబ్బంది ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): చెడు అలవాట్ల విషయమై తల్లిదండ్రులు మందలించారని ఓ యువకుడు బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. నెల్లూరు నగరంలోని రంగనాయకులపేట గొల్లవీధికి చెందిన సుబ్రహ్మణ్యం (21) ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యసనాలకు బానిసై న అతను సంపాదించిన మొత్తాన్ని ఖర్చు చేయసాగాడు. చెడు అలవాట్లు మానుకోవాలని ఇటీవల తల్లిదండ్రులు మందలించారు. దీంతో సుబ్రహ్మణ్యం తన ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సుబ్రహ్మణ్యం మృతి చెందాడని నిర్ధారించారు. తల్లి రమాదేవి సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ ప్రధానాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.